సమర్థించుకోవడంలో ఆశ్చర్యం లేదు. మలయా, సూడానులలో బ్రిటన్ వ్యవహరిస్తున్న విధానానికి టునీసియాలో ఫ్రాంసు అవలంబిస్తున్న విధానానికి భేదం లేదు. శాన్‌ఫ్రాన్సిస్కో సమావేశం అప్పట్నుంచీ ఏ విషయాన్నైనా మండలి చక్కగా చర్చించవచ్చునే పద్ధతిలో వ్యవహరించిన అమెరికా చటుక్కున తన రాజకీయనీతికి తిలోదకాలు వదలుకోవడం కేవలం ఫ్రాన్సు మెప్పుపొందడానికి టునీసియా సమస్య అమెరికా విధానంలో ఈ విధంగా మార్పుతీసికొని రావడాన్ని ప్రపంచం హర్షించదు. వెనుకనే వున్న అట్లాంటిక్, నాన్-అట్లాంటిక్ రాజ్యాల విభేదాలు ఈ టునీసియా సమస్యతో మరికొంత విస్తృతం అవుతాయి. అమెరికా స్టేటు డిపార్టుమెంటుకు గూడా టునీసియా సమస్యపై ఏకాభిప్రాయం లేదని అమెరికన్ ప్రతినిధి చేసిన ప్రకటనలను బట్టి తేలుతుంది. మొదట్లో టునీసియా సమస్యను భద్రతామండలి చర్చించడానికి అనుకూలంగా కనుపట్టిన అమెరికా తుట్టతుదకు తాటస్థ్యం వహించడంలో ఔచిత్యం లేదు. భద్రతా మండలి అధ్యక్షుడును, పాకిస్తాన్ ప్రతినిధియు అయిన అహమద్ బొఖారి చెప్పినట్లు టునీసియా సమస్యను ఎజెండాలో చేర్చి చర్చించనైనా కూడదని మండలి నిర్ణయించడంతో ఐక్యరాజ్య సమితి చరిత్రలో నిష్పాక్షిక చర్చలు జరుపడానికైనా ప్రతిబంధకం కలిగించవచ్చునే చెడుసూత్రాలకు పునాదులేర్పడ్డాయి. మండలి తీసికొన్న ఈ నిర్ణయం ప్రజాస్వామిక సూత్రాలకు విఘాతం, ఆసియా-అరబ్ రాజ్యాల నిజాయితీకి ఒక సవాల్. ఈ క్లిష్ట పరిస్థితులనుండి ప్రపంచాన్ని అధమం ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశమైనా తొలగించ కలదని ఆశిద్దాం.

కథానిక

# సంవత్సరాది

తొయ్యేటి భానుమూర్తి

తెల్లవారుతోంది. ప్రాతఃకాలపు పిల్లగాలుల చల్లదనానికి, అగ్రహారంలో అరుగుమీద పడుకున్న కరణం వీర్రాజు హు, హు. హూ అంటూ కదులుతున్నాడు. ఆకాశంమీద నక్షత్రాలింకా మసక మసకగా కనిపిస్తూనే వున్నాయి. పనిమనిషి సూరమ్మ చీపురుకట్టతో వీథితుడిచి ముగ్గువెయ్యటానికి "ఏవండోయ్" అని తలుపుతట్టుతూ కేకేసింది. కోనేటిలో తాటిచెట్టు కదిలినట్టు ఆ స్వరంలో అదోరకమైన కదలిక బయలుదేరి వినడానికి యేవగింపుగా వుంది రాత్రి తెల్లవార్లు నిద్రపట్టక బాధపడ్డ వీర్రాజు విసుకుతో 'ఏతే పొద్దున్నే కోకిలధ్వని చేస్తున్నావ్" అంటూ లేచి అగ్గిపుల్ల గీసి లంకపుగాకుచుట్ట వెలిగించాడు.

"మీరేనంటండి బాబయ్యా! అప్పుడే ఇవతల పడుకుంటున్నారేటండి?"

"ఆ. ఏవుంది అప్పుడే యీవేళ సంవత్సరాది వచ్చిందా? ఇంక ఇవతల కాకపోతే లోపలెందుకే" అంటూ మంచం దిగి స్తంభానికి చేర్లబడ్డాడు.

ముసిముసి నవ్వులతో సూరమ్మ, తలుపు తెరవడంతోటే తన పనిలోకి వెళ్ళిపోయింది.

వీథిలోకి నాలుగు కుక్కలు భౌయ్ భౌయ్ మంటూ అరుమకుంటూ వచ్చాయి. వీర్రాజు అరుగు దిగి నాలుగు కేకలేసి నాలుగు బెడ్డలు విసిరెయ్యడంతో పక్కవీథికి పరిగెత్తాయి. ఉషఃకాంతులతో ప్రకాశించే కొత్తదనానికి తెల్లపోయి గాబోలు కరణంగారి నోట్లోంచి చుట్టపొగ త్వరత్వరగా ప్రయాణం చేస్తోంది తన పాతసంవత్సరం కోసం. అరుగుమీద కూచుని తదేకధ్యానంతో ఆలోచన మొదలు పెట్టేడు వీర్రాజు. "చలింకా తగ్గలేదు కదా! తను

యువతెందుకు పడుకోవాలి? పడుకున్నానయ్యా, నూరమ్మ యెందుకడగాలి? తన ఖర్మం కాకపోతే ఒక్క పిల్లాను తప్ప ఇంకెవరూ లేని తమ ఒంటరి జీవితంలో హాయిగా సంసార సుఖాన్ని చూరగొనే రోజుల్లో విలువైన రాత్రి పోయిందే. "ఇంతకీ ఎందుకు దాటిపోవాలి?" పాపం రాజమ్మదేం తప్పూ చెప్పండి. ఇక్కడికి రెండు సంవత్సరాలబట్టి చెపుతోంది వూళ్ళో డాక్టరుగారి భార్య అందమైన కొత్త కోక కొనుక్కుందని. మంచిమంచి పువ్వులు, పట్టంచు, లేతగులాబీరంగు, పట్టుకుంటే జారిపోయే మెత్తదనం. అబ్బ' వెయ్యి చీరలకు సమానం అనుకో వచ్చు. తనకీ అలాంటిది కట్టుకోవాలనివుంది. తను కట్టుకుంటే తన సౌందర్యం ఎన్నిముఖాల వ్యాపిస్తుందో! అప్పుడు తనలా యెవరేనా వుంటారా? తన మొగుడు గ్రామానికంతకీ కరణం, అలాంటి చీర యెవరో కొన్నారంటే నే చాలు తెచ్చిస్తాడనుకుంది. ప్రతి పండక్కీ చెపుతూనే వుంది. ఆఖరికి నిన్న మధ్యాహ్నం భోజనచేస్తోన్నప్పుడు కూడా చెప్పింది "ఏమండీ? ఆ చీర చాలా బాగుందండీ" అని. బాగుంటే బాగుండనియ్ అన్నాడుగాని నీకూ కూడా కావాలా? అనలేదు ఇంతకీ తనభార్య కట్టుకోవడం ఎవరికోసం? తనకోసం తన ఆనందంకోసమే కదా? అయితే ఎందుకు తేకూడదు? అక్కడేవుంది కుంభకోణం. గత రాత్రి భోజనాలయ్యాక మంచంమీద పడుకొని ఏదో చదువుతూంటే తమలపాకులు అందిస్తో మళ్ళీ అడిగింది. "ఏవండీ ఇక తప్పదండి. నాకలాంటి కొత్తకోక తేవాలి. రేపు సంవత్సరాది. ఖరీదంతో లేదు పాతిక రూపాయలేట కూడాను"

"కొత్త కోక లెన్నో కొనుక్కున్నావు పెట్టెలోపడి మూల్గుతున్నాయి. అవి చాలవూ?"

"కొత్తకోకంటే కొత్తరకం అని చెప్పాను. వాటిని కొత్త కోకలనే అంటారు."

"పాతికరూపాయలకి పట్టంచుకోక యెవడిస్తాడే?"

"పట్టంచంటే బెత్తెడు వెడల్పుందనుకుంటున్నారేమిటి? గోరంచువండి. అందుకే చక్కగా వుంది."

పాపం వీర్రాజుకికూడా కొందామనే వుంది. కాని తన అత్తారిమీదవున్న కసి మాట? ఎన్ని పండుగలు గడిచిపోయేనా తన చేతికిమాత్రం వాచీ రాలేదు. ఏనాటి అలకపాన్పు, ఏనాటి గొడవ. ప్రతిపండక్కీ ఇస్తానంటూండడం ఊరుకోవడం. ఇదీవరస. పోనీ డబ్బిచ్చేయండి నేనే కొనుక్కుంటూనన్నాడు. అది తనే కొనివ్వాలిగాని మరోలా పనికిరాదన్నాడు మావగారు. ఆఖరికి ఓ పిల్లాడు కూడా పుట్టాడు. వాచీ మాత్రం రాలేదు. తన పెళ్ళాం రాజమ్మతోటి అనేకసార్లు చెప్పాడు.

"ఇంకెక్కడిస్తాడు మానాన్న బోలెడు సంసారంతో వేగిపోతున్నాడ"ని విసుక్కుంది. మావగారివ్వనందుకు అంత కోపం లేకపోయినా, తన పెళ్లాం అలా అన్నందుకుమాత్రం కోపం యెక్కువయింది. దాని ఫలితమే అనేక చీరలు కొంటూన్నా కొత్త కోకమాత్రం కొనకపోవటానికి కారణం. ఇంక ఆశలేక రాత్రి అనేశాడు కూడాను "మీనాన్న వాచీ కొనివ్వలేకపోయాడుగాని నేను కోక కొనివ్వాలే!" అని. దానితో యిద్దరి మధ్య మనస్పర్థలు ప్రారంభమయ్యాయి. రాజమ్మ మూతి బిగించుకుంది. ఒక చాప పరుచుకొని నేలమీద పడుకుంది. వీర్రాజు ఓమడత మంచం వీధి అరుగుమీద వాల్చుకుని పడుకున్నాడు. ఒకళ్ళని సాధిద్దామని ఇంకొకరికి పట్టుదలలు పెరిగిపోయాయి. ఆలోచనలతో వేడెక్కి రాత్రంతా నిద్దరపట్టలేదు. ఎదురుగావున్న కొబ్బరి చెట్లమీద కాకులు కూయడం ప్రారంభించాయి. గూళ్లలో దాక్కున్న పక్షుల కిలకిలా రవాలతో ఆలోచన మాయమయింది. తదేకదృష్టితో వాటిని చూస్తున్నాడు. "కరణం బాబయ్యగారు నమస్కారమండి" అన్న శబ్దంచే తన జగత్తులోకి మళ్ళించింది.

"ఏరా! వెంకడూ పొద్దున్నే వచ్చావే?"

"ఏవుందండి బాబయ్యగారు! ఈయాల కర్నంగారి ఉగాది పచ్చడి రుసి సూడాలనొచ్చానండి"

"నీ మొహం తెల్లారకండా పచ్చడేమిటిరా!"

“అదేనండి బాబయ్య. యాప్పుళ్ళు కోసుకొచ్చానండి. మావిడి పిందెలు కూడా కొట్టుకొచ్చానండి. ఇంకేటి గావాలో సెలవిత్తె.”

“సరే అమ్మగార్నడిగి తెద్దువుగాని. అన్నట్టు పెద్దకాపు కిస్తీ సెల్లించేటా?”

“ఇచ్చారండి తిప్పితిప్పి. రాత్రి పదింటిదాకా ఆరిపనిలోనే వున్నానండి. ఆకర్ని ఏభై రూపాయలా రణాల కొని పుచ్చుకున్నానండి. కాని,”

“పట్టుకొచ్చావా?”

“లేదు బాబయ్యా! యాప్పుళ్ళడావిడిలో ఇంటికాడ మరిసిపోయానండి. ఆనక తెత్తానండి.”

“సరే నువ్వలా దొడ్డి గుమ్మంకేసెళ్ళి ఏం కావాలో కనుక్కో!”

“సిత్తం.”

ఇంటిలోంచి పనిమనిషి సూరమ్మ చెంబు నీళ్లు తెచ్చి పెట్టింది. వీర్రాజు దంతధావనంచేసి లోపలికెళ్ళాడు. రాజమ్మ కొడుక్కి తలంటి నీళ్లు పోస్తోంది. వీర్రాజు కూడా ఆ ప్రయత్నంలో నిమగ్నుడయ్యాడు. కాలాన్ని తిప్పే చక్రంలా సూర్యుడుదయించాడు. కాంతి కిరణాలు చెట్లమీద ప్రసరించి నూతనశోభ అంకురించింది. అభ్యంగనాలు పూర్తయ్యాయి. పిండివంటలతో భోజనాలు కూడా అయ్యాయి. వీర్రాజు కాస్సేపు కునుకుతీసి కొడుక్కి కొత్త బట్టలు కట్టి తను కూడా కొత్తబట్టలు కట్టుకున్నాడు. రాజమ్మ మాత్రం మామూలు బట్టలే కట్టుకుంది. ఊళ్ళోంచి పంచాంగ శ్రవణాని కాహ్వానం వస్తే అక్కడికి బయలుదేరాడు వీర్రాజు. గంగరావి చెట్టుక్రింద శాస్త్రిలుగారు పంచాంగం చదువుతున్నారు. జనసమూహం చుట్టూచేరి నిశ్శబ్దంగా వింటున్నారు. శాస్త్రిలుగారు చెప్పే ఫలితాలకు మధ్యమధ్య నవ్వుతున్నారు. వీర్రాజు రాగానే కొంతమంది తప్పుకుని ఆయన కూచోటానికి చోటుచేశారు. పంచాంగ శ్రవణం ముగిసింది. కందాయఫలాలు చెప్పించుకుని అందరూ ఇంటిముఖం పట్టారు. వీర్రాజుకి ఆదాయం ఆరు, వ్యయం పదకొండు అని చెప్పేరు శాస్త్రిలుగారు. దాంతో అదోదిగులు బయలుదేరింది. ఇంటికి చేరేసరికి సూర్యుడస్తమించాడు. పశువులకి చిట్టు పొట్టు పెట్టి పాలు పితికించాడు. మధ్యాహ్నం శేషించిన పిండివంటలతో సహా భోంచేసి, వీధరుగుమీద నలుగురు రైతులతో బాతాఖానీ ప్రారంభించాడు. రాత్రి పదింటిదాకా అంతులేకుండా జరిగింది. వీధి తలుపు వేసి లోపలకొచ్చేసరికి రాజమ్మ ముసుగుతన్ని పడుకుంది. వీర్రాజు కోపం పోలేదు కాబోలనుకుంటూనే ముసుగు తీశాడు. ఇంకే వుంది ప్రాణం పోయినట్టయింది. రాజమ్మ పకపకా నవ్వుతోంటే ఆ నవ్వుల కాంతిలో విజయగర్వం తొణికిసలాడుతోంది.

“ఎలా కొన్నావ్?”

“ఎలాగేంటి వెంకడిచ్చిన కిస్తీ సొమ్ము.”

వీర్రాజు ఇంక మాట్లాడలేక పోయాడు. సరిగా రాజమ్మ ఏదయితే చెప్పిందో అదే కొత్తకోక. దానితోపాటు కొత్త రవికె కూడాను. ఆ కోకతో రాజమ్మ రంభలా మెరిసిపోతోంది. తలలో వున్న సంపెంగ పువ్వుల వాసన ఘుమ్మని వీచింది. వీర్రాజుకి క్రోధం బదులు ఆనందం రేకెత్తింది. రాజమ్మ విజయానికి లొంగిపోయేడు. కాంతి పెద్దదిచేసి వాళ్ళ ఆనందాన్ని చూస్తోన్న దీపాన్ని ఓ పిల్లగాలొచ్చి సిగ్గులేదా అన్నట్టు ఆర్పేసింది. దొడ్లో మల్లెపూల వాసన గదినంతా ఆవరించింది.

లండన్‌లోని సోవియెట్ రాయబారి కార్యాలయం గురించిన ఇటీవలి కథ: ఒక వార్త వివరాలడగడానికి ఎవరో పత్రికా ప్రతినిధి టెలిఫోన్ చేశాడు. టెలిఫోన్ అందుకున్న సోవియెటు ఆపరేటరు “ఆయన ఇక్కడ లేడు” అని సమాధానం చెప్పాడు. “ఎవరు లేనిది?” అని రిపోర్టరు ఆశ్చర్యపోయాడు. “మీరు ఎవరితో మాట్లాడాలని వుందో ఆయన” అని వచ్చింది జవాబు.